# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506




## మాజీ ఐపీఎస్ పాస్‌పోర్టు రద్దు

04



ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | గురువారం, 10 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 28 | పేజీలు: 4 | వెల:10/-


# ఓ మనిషీ.. నువ్వెక్కడ?

- మాయమవుతున్న బంధాలు
- ఆత్మీయ పలకరింపు కరువు

**కని, పెంచిన వారినే వదిలించుకుంటున్న సంతానం**

- ప్రజల్లో పెరుగుతున్న స్వార్థ చింతన
- అనైతిక బంధాలతో కుటుంబాల్లో కల్లోలం
- మళ్లీ ఆదిమ కాలానికి మనిషి







ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అవి బంధాలు, అనుబంధాలు, ఆత్మీయతలు, అనురాగాల కలబోతగా ఉండేవి. కుటుంబంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరూ కలిసి పంచుకునేవారు. ఆనందాన్ని కూడా అలాగే అనుభవించేవారు. కానీ, ప్రపంచీకరణ ఉమ్మడి కుటుంబాలను చిదిమేసింది. వాటి స్థానంలో మైక్రో ఫ్యామిలీలను తీసుకొచ్చింది. బంధాలు, అనుబంధాలు మాయమయ్యాయి. బాధపడితే ఊరడించేవారు కరువయ్యారు. సంతోషాన్ని పంచుకునే వారు మాయమయ్యారు. మనిషి యాంత్రిక జీవనంలో పడి కొట్టుకుపోతున్నాడు. మానవత్వం మచ్చుకైనా కనిపించడం లేదు. మనిషన్నవాడు ఎప్పుడో మాయమైపోయాడు. అత్త, అమ్మ, అన్నా, చెల్లి, అన్న, మామ అందరూ ఉంటారంతే, కానీ ఎవరికి ఎవరూ పట్టరు. ఇదీ నేటి బతుకు చిత్రం.


- నేటి ప్రస్థానం, స్టేట్ బ్యూరో:



మిగతా 2 లో

# రక్తహీనతకు బ్రేక్ ఇలా!

02







# జల్‌పల్లిలో మరోసారి ఉద్రిక్తం

03

- మోహన్‌బాబు ఇంటి ఎదుట పోలీస్ బందోబస్తు
- ఉదయం మోహన్‌బాబు ఇంటికి వెళ్లిన మంచు మనోజ్
- మోహన్‌బాబు ఇంట్లోకి ఎవరిని అనుమతించని పోలీసులు

## ఎల్బీనగర్ కోర్టులో మోహన్‌బాబుకు చుక్కెదురు

గత తీర్పును కొట్టివేసిన కోర్టు

కొత్త సాక్ష్యాలు, ఆధారాలు బయటకు రావడంతో నిర్ణయం



03

## సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ సన్నద్ధం: డీజీపీ



04



04

## సీనియర్ ఐఏఎస్ రోనాల్డ్ రోస్‌కు ఊరట

తెలంగాణలో కొనసాగేలా ఉత్తర్వులు

సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ రోనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. రోనాల్డ్ రోస్ తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది.




# రక్తహీనతకు బ్రేక్ ఇలా!



రక్తహీనతతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. శరీరంలో విటమిన్లు, సూక్ష్మ పోషకాలు తగ్గడంతో రక్తహీనత ఏర్పడుతుంది. శరీరంలో రక్తం తగ్గితే నీరసం ఆవహిస్తుంది. ఏ పనీ చేయబుద్ధి కాదు. శ్వాసలో ఇబ్బంది కలిగి ఎక్కువ దూరం ప్రయాణం చేయలేం. చేతులు, కాళ్లు పేలగా మారుతాయి. రక్తహీనత ముఖ్యంగా మూడు రకాల కారణాలతో ఏర్పడుతుంది. ఆరోగ్య సమస్యలు ఉండటం, తగిన మోతాదులో ఎర్రరక్త కణాల ఉత్పత్తి లేకపోవడం, క్లోమం వాపు, సికిల్ సెల్ ఎనీమియా, థలసేమియా మొదలైనవి కారణం అవుతాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా, పుండ్లు కావడంతో అధిక రక్తస్రావం కావడం, కిడ్నీ సమస్యలు కూడా రక్తహీనతకు కారణమవుతాయి.



### లక్షణాలు..

- నిద్రలో కాళ్లు అదే పనిగా కదుపుతూ ఉండటం.. మధ్య మధ్యలో గొక్కుంటూ ఉండటం
- చర్మం పాలిపోయి, పెదవి లోపలి భాగం చిగుళ్లు, కనురెప్పల లోపల కూడా ఎరుపుతనం తగ్గడం
- చర్మం కాంతి తగ్గి నిర్జీవంగా మారడం, ముఖం పసుపు రంగులోకి మారి పాలిపోయి ఉంటుంది
- గుండె వేగంగా కొట్టుకోవడం, కండ్లు తిరిగి పడిపోవడం
- తరచూ తలనొప్పి, అతికోపం, అతి చిరాకుగా ఉండటం
- కండ్లు తిరిగి పడిపోవడం, ఆహారం సరిగా తీసుకోకపోవడం

### పరిష్కారం ఇలా..

- ఒకటి లేదా రెండు అంజీర్‌లు, రెండు ఎండు ఖర్జూరాలు , 10 నుంచి 12 ఎండు ద్రాక్షలు రాత్రి నానబెట్టి ఉదయం తినడంతో పాటు నానబెట్టిన నీటిని తాగాలి
- ప్రతిరోజు పాలకూర జ్యూస్ తాగాలి
- బీట్‌రూట్, క్యారెట్, ఉసిరి కలిపి ఉదయాన్నే తాగితే రక్తం పుష్కలంగా వృద్ధి చెందుతుంది
- ప్రతిరోజు దానిమ్మ జ్యూస్ తాగాలి
- మధ్యాహ్న భోజనంలో తోటకూర, గోంగూర ఏదో ఒక ఆకుకూరను తప్పకుండా ఉండేలా చూసుకోవాలి
- ప్రతి రోజు ఒక కప్పు బూడిద గుమ్మడి రసం తాగాలి
- రాత్రి నానబెట్టిన శనగలు ఉదయాన్నే తినాలి
- గోధుమ గడ్డి జ్యూస్ కూడా తీసుకుంటే ఒంట్లోకి రక్తం బాగా చేరుతుంది
- ఆపిల్, జామ, అరటి, ద్రాక్ష లాంటి పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవాలి
- మునగాకు, మునగ కాయలను క్రమం తప్పకుండా తినాలి
- పచ్చి ఖర్జూర, పల్లీలు, నువ్వులు కలిపి లడ్డూలుగా చేసుకొని తినాలి.
- డ్రాగన్ ఫ్రూట్, బత్తాయి, నారింజ, తర్బూజా, పుచ్చకాయ లాంటి వాటర్ ఎక్కువ శాతం ఉన్న పండ్లను తినాలి
- యోగా, మెడిటేషన్‌తో పాటు ముద్రలు వేయాలి
- రాత్రి వేళల్లో త్వరగా తిని పడుకోవాలి.

- నేటి ప్రస్థానం, ఫీచర్ ఎడిటర్





# ఓ మనిషీ.. నువ్వెక్కడ?



ఇది సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఆవరణలో జరిగింది. ఆమె వయసు 90 ఏళ్లు. ముడతలు పడిన శరీరంలో ఆమె కళ్లు తడారిపోయి ఉన్నాయి. దవాఖానలోకి వచ్చిపోయే వారిని పరికించి చూస్తోంది. తన కన్నబిడ్డలు కనిపిస్తారేమోనన్న ఆశ ఆ ఎండిన కళ్లలో లీలగా కనిపిస్తోంది. అడుగుల శబ్దం వినిపిస్తే చాలు తన బిడ్డలే కావొచ్చని ఆతృతుగా అటు చూస్తోంది. అయినా, గత పది రోజులుగా ఆమెకు నిరాశే ఎదురవుతోంది. ఎక్కడికి వెళ్లాలో.. ఏం చేయాలో తెలియక మూగగా రోదిస్తోంది. ఆమె దీన పరిస్థితి చూసిన స్థానిక మహిళ ఒకరు ఆమెకు అన్న, పానీయాలు అందిస్తోంది. ఆమె దిక్కులేనిది కాదు, ఐదుగురు కొడుకులున్నారు. కానీ, ఇప్పుడామె అందరికీ భారమైంది. ఆమె పేరు కాశమ్మ. నారాయణ్‌ఖేడ్. ఏమైందో ఏమో.. ఒక రోజు మనవడు ఆమెను తీసుకొచ్చి దవాఖాన ఆవరణలో వదిలేసి వెళ్లిపోయాడు. మళ్లీ వస్తాడేమో, తీసుకెళ్తాడేమో అని ఎదురుచూస్తోంది. కానీ, 'కొడుకులూ రావడం లేదు.. దేవుడూ నన్ను తీసుకెళ్లడం లేదు' అంటూ తడారిన గొంతుతో చెబుతున్న ఆమె మాటలు విన్నవారి కళ్ల వెంట నీళ్లు ఉబికి వచ్చాయి.

**ఈ ఒక్క ఉదాహరణ చాలు.. మానవ సంబంధాలు ఎంతగా మృగ్యమయ్యాయో చెప్పేందుకు. ఇది ఒక్క కాశమ్మ కథ మాత్రమే కాదు.. దేశంలో నిత్యం ఇలాంటి వార్తలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. మరోచోట నలుగురు పిల్లలున్న తల్లి అంతిమ సంస్కారాలకు కూడా నోచుకోలేకపోయింది. చివరికి పారిశుద్ధ్య కార్మికులు ఆమెకు దహన సంస్కారాలు చేయాల్సి వచ్చింది.**



## భారమవుతున్న తల్లిదండ్రులు

దేవుడి కంటే కూడా తల్లిదండ్రులకే మొదటి స్థానం ఇచ్చారు మన పెద్దలు. దేవుడు కూడా వారి తర్వాతేనని, కనిపెంచిన తల్లిదండ్రులు కనిపించే దేవుళ్లని అంటారు. కానీ, ఆ కనిపించే దేవుళ్లు పిల్లలకు భారమైపోతున్నారు. పిల్లలు ప్రయోజకులు కావాలని కలులు కనే తల్లిదండ్రులు.. వారు ప్రయోజకులు కాగానే వీరు వృద్ధాశ్రమాలకు చేరుతున్నారు. దీంతో కుటుంబ విలువలు తెలియని పిల్లలు ఎవరికి వారేనన్న భావనతో బతుకుతున్నారు. ఇక ఇప్పుడు సెల్‌ఫోన్ల పుణ్యమా అని ఉన్న కొద్దిపాటి సంబంధాలు కూడా మాయమైపోతున్నాయి. గతంలో ఓ గ్రామంలో వంద కుటుంబాలుంటే కనీసం 20 కుటుంబాలన్నా ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు ఊరికి రెండు, మూడు కుటుంబాలు కూడా కలిసి ఉండడం లేదు. సొంత కుటుంబ సభ్యులు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబం తేరుకోవడానికి ఒకప్పుడు కొన్ని నెలలు పట్టేది. కానీ, ఇప్పుడు ఆ బాధ కొన్ని రోజులు కూడా ఉండటం లేదు. యాంత్రిక జీవనం అన్నింటినీ 'టేకిట్ ఈజీ'గా తీసుకునేలా అలవాటు చేసింది.

## పెరుగుతున్న స్వార్థ చింతన

మనుషుల్లో ఇప్పుడు స్వార్థ చింతన నానాటికీ పెరిగిపోతోంది. ఎవరు ఏమైతే నాకేంటి? నా కుటుంబం బాగుంటే చాలనే స్వార్థం ఎక్కువైంది. ఆఖరికి తన సొంత అమ్మా నాన్న, అక్కా చెల్లి, అన్నదమ్ములను సైతం పట్టించుకోవడం లేదు. గతంలో గ్రామంలో ఎవరి ఇంట్లోనైనా శుభ, అశుభకార్యాలు జరిగితే పనులు చేసేందుకు ఇంటికోమనిషి వెళ్లేవారు. ఇప్పుడు పెళ్లి సమయానికి వెళ్లి భోజనం చేసి వచ్చేస్తున్నారు. దీంతో శుభ, అశుభ కార్యక్రమాలకు ఈవెంట్ మేనేజర్లే దిక్కవుతున్నారు. గతంలో ఇంటికి ఎవరైనా బంధువులొస్తే గంటల తరబడి పలకరింపులుండేవి. ఆపై బంధువులకు విందుభోజనం వడ్డించేవారు. ఇప్పుడు ఎవరైనా బంధువులు ఇంటికోస్తే నిమిషం పలకరింపు, బిజీగా ఉన్నామని, ఇంకోసారి వస్తామని పదినిమిషాల్లో వెళ్లిపోతున్నారు. మన ఇంట్లోని వారు సైతం బంధువులతో మాట్లాడకుండా స్మార్ట్‌ఫోన్లకు అతక్కుపోయి ఉంటున్నారు. గతంలో ఎవరికైనా కష్టం వస్తే ఇరుగుపొరుగు వారో, స్నేహితులో మంచి సలహా చెప్పి సమస్యకు పరిష్కారం చూపేవారు. ఇప్పుడు ఆత్మీయ పలకరింపులు లేవు. ఎవరు చూసినా వారి పనుల్లో బిజీబిజీ. రోడ్డుపై ప్రమాదం జరిగినా కేసవుతుందని పక్కనుంచి వెళ్లిపోయే సమాజమిది.



## అనైతిక బంధాలతో ఛిన్నాభిన్నం



అనైతిక సంబంధాలు చాలా కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చోటుచేసుకుంటున్న హత్యలు, ఆత్మహత్యలు వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు చేటు తెస్తున్నాయి. వారిని కటకటాలపాలు చేయడంతో పాటు, వారిపై ఆధారపడిన వాళ్లకీ సమస్యలు తప్పడం లేదు. వివాహేతర సంబంధాలపై అనుమానంతోనూ నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. మోజు ముసుగులో సంబంధాలు మంటగలుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఇటీవల ప్రియుడి మోజులో పడిన ఓ మహిళ లండన్ నుంచి కుమార్తెను చూసేందుకు వచ్చిన మర్చంట్ నేవీ మాజీ అధికారి అయిన భర్తను దారుణంగా హత్య చేసింది. ఆపై మృతదేహాన్ని ముక్కలుగా నరికి ప్లాస్టిక్ డ్రమ్ములో వేసింది. హర్యానాలోని ఝుజ్జర్ జిల్లా ఖర్మాన్ గ్రామంలో ఇలాంటిదే మరో ఘటన జరిగింది. ప్రియుడితో ఉండగా పట్టుకున్న భర్తను నేవీ అధికారి మాదిరి చంపుతానని భార్య బెదిరించింది. మరోచోట భర్తను అడ్డు తొలగించుకునేందుకు అతడికి ఇష్టమైన కోడికూర వండి విషం కలిపిందో భార్య. ప్రేమగా వడ్డిస్తున్న భార్య తీరుపై అనుమానం రావడంతో ఆ భర్త బతికిపోయాడు. కూరను కుక్కకు పెడితే అది తిని మరణించింది. ఇలా.. ఒకటి కాదు, రెండు కాదు.. కోకొల్లుగా ఇలాంటి బయటపడుతున్నాయి. ఆ మధ్య కాలంలో ఓ ప్రొఫెసర్ భార్య.. ప్రియుడి మోజులో పడి భర్తను దారుణంగా హతమార్చి అండర్ బ్రిడ్జి క్రింది దహనం చేసింది. ఫలితంగా భార్య కటకటాల పాలైతే, పిల్లలు అనాథ శరణాలయం పాలయ్యారు. జనగామ మండలం మరిగడి గ్రామానికి చెందిన కూరాకుల రమణమ్మ (55)ను ఆమె కుమారుడు కన్నప్ప ఆస్తి తగాదా విషయంలో తలా మొండెం వేరుచేసి గ్రామంలో వీరంగం సృష్టించాడు.

## పాశ్చాత్య పోకడలే కారణం

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం వల్ల వ్యక్తిగత సంబంధాలు, విలువలు క్షీణిస్తున్నాయని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విపరీతమైన పాశ్చాత్య పోకడలే ఇందుకు కారణమని అంటున్నారు. సమాజంలో కట్టుబాట్లు మాయమవుతుండడంతో విచ్చలవిడితనం పెరుగుతోంది. భార్యాభర్తల మధ్య కలహాలు పెరగడంతో ఇది విడాకుల వరకు వెళ్తోంది. ఇది కుదరని పరిస్థితుల్లో వివాహేతర సంబంధాల వైపు దారి తీస్తోంది. పరిసరాల ప్రభావం కూడా ఎక్కువగానే ఉంటోంది. బంధాలను కూడా మరచిపోయి విచక్షణ కోల్పోయి దాడులు చేసే వరకు వెళ్తోంది. వివాహేతర సంబంధాల విషయంలో భార్యాభర్తల మధ్యే ఎక్కువగా కక్ష సాధింపులు జరుగుతున్నాయి. అనైతిక సంబంధాలను వద్దని ఇంట్లో వారిస్తే ఆత్మహత్య చేసుకునేందుకు కూడా వెనుకాడడం లేదు.


## మళ్లీ ఆదిమజాతి దిశగా..

గ్రహాలను అన్వేషిస్తున్న మానవుడు మానవత్వాన్ని మాత్రం మంటగలిపేస్తున్నాడు. నిత్యం అభివృద్ధి వైపు పరుగులు తీస్తూనే ఆదిమ సమాజాల కాలానికి పోతున్నాడు. అనాగరిక సమాజంలో ఒక మనిషి మరొక మనిషిపై, ఒక జాతి మరొక జాతిపై ఆధిపత్యం చెలాయించేది. ఆ ఘర్షణల్లో హింస చెలరేగి వందలు, వేలు చనిపోయి నాగరికతలే ధ్వంసమయ్యాయి. మనిషి మెదడులో వచ్చిన మానవ వికాసం క్రమేణ మార్పు చెందటం నాటి పశు ప్రవృత్తిని వదులుకొని ఆటవిక దశ నుంచి సంఘ జీవనం వైపు మళ్లటం చరిత్ర పరిణామం. కానీ, మళ్లీ అక్కడక్కడా ఆదిమ కాలం నాటి సంఘటనలే జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.





- మాయమవుతున్న బంధాలు
- ఆత్మీయ పలకరింపు కరువు
- కని, పెంచిన వారినే వదిలించుకుంటున్న సంతానం
- ప్రజల్లో పెరుగుతున్న స్వార్థ చింతన
- అనైతిక బంధాలతో కుటుంబాల్లో కల్లోలం
- మళ్లీ ఆదిమ కాలానికి మనిషి





## ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావం..

**నేటి ప్రస్థానం, చౌటుప్పల్:** ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ వేడుకలను యాదాద్రి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శ భీమనపల్లి శివ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎన్ఎస్‌యూఐ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ రవీందర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు బోయ రవి చంద్రం, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బోయ నవీన్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు పోతగాని శివ, ఎర్ర శ్రీధర్, బోయ శివ, బోయ ప్రకాశ్, యువజన నాయకులు బోయ నిరంజన్, బోయ సంపత్, తూర్పింటి వంశి, బోయ అరవింద్, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అనంతన్ మరణం బాధాకరం..

### ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



**నేటి ప్రస్థానం, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొప్ప సాహితీవేత్త శ్రీ కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) గారి మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహాత్ముడి సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు అనంతన్ గారిని కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. కుమారి అనంతన్ గారు నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళిసై గారికి, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి గారు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. అనంతన్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

## బర్త్ డే ముసుగులో ముజ్రా పార్టీ

### భారీగా మద్యం, గంజాయి స్వాధీనం

### ఏడుగురు యువతులు, 12 మంది యువకులు అరెస్ట్

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** బర్త్ డే పార్టీ పేరిట ముజ్రా పార్టీ నిర్వహించారు. మద్యం, గంజాయి మత్తులో యువతులు, యువకులు అర్ధనగ్న నృత్యాలతో పాటు మద్యం మత్తులో చిందులేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని ఎతుబార్ పల్లి గ్రామంలోని ఓ ఫామ్ హౌస్‌లో మంగళవారం రాత్రి ఈ పార్టీ జరగగా.. సమాచారం అందుకున్న పోలీసులు 7 మంది యువతులు,12 మంది యువకులను అదుపులోనికి తీసుకున్నారు.వారి నుంచి 12 గ్రాముల గంజాయి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వృద్ధిరేటులో అట్టడుగున తెలంగాణ

### కాంగ్రెస్ నిర్వాకంపై మండిపడ్డ కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** జీఎస్డీపీ, తలసరి వృద్ధి రేటులో తెలంగాణ అట్టడుగున నిలవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వేసిన ఆర్థిక పునాదులను కాంగ్రెస్ సర్కార్ ధ్వంసం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. జీఎస్టీ వృద్ధిరేటు గుండు సున్నాగా నమోదు కావడంతో ఆయన ధ్వజమెత్తారు. సన్నాసి ఢిల్లీ పార్టీలను నమ్మితే.. తెలంగాణ బతుకు సున్నా అని మరోసారి రుజువుచేసిన సందర్భమిది అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలివి లేని దద్దమ్మను గద్దెనెక్కిస్తారు.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తారు.. కోట్లాది మంది జీవితాలతో చెలగాటమాడతారు అని కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఆర్థిక వృద్ధిలో అగ్రభాగాన ఉన్న రాష్ట్రాన్ని పాతాళానికి పడేసిన ఈ పాపం క్షమించరానిది. టూరిస్టు పార్టీలను నమ్మితే జరిగే విధ్వంసమిది.. విజన్ లేనోళ్ల చేతిలో రాష్ట్రాన్ని పెడితే జరిగే వినాశనమిది. నాటి పదేళ్ల దార్శనిక పాలనకు.. నేటి దగుల్బాజీ విధానాలకు మధ్య తేడాను నాలుగు కోట్ల సమాజం నిశితంగా గమనిస్తోంది. ఇక జీవితంలో ఈ ఢిల్లీ పార్టీలను తెలంగాణ నమ్మదు.. మళ్లీ ఎప్పటికీ మోసపోదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మూడ్రోజుల పాటు ఈదురుగాలులతో వర్షాలు

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** భారత వాతావరణ విభాగం తాజాగా వాతావరణ పరిస్థితులపై కీలక అప్‌డేట్‌ను విడుదల చేసింది. ఏప్రిల్ 9 నుంచి 12వ తేదీ వరకు దక్షిణ దేశంలోని పలు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, పలు ప్రాంతాల్లో పిడుగుపాటు- సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ వర్ష సూచనల ప్రభావం కోస్తాంధ్ర, యానాం, తెలంగాణ, కేరళ, మాహే, కర్ణాటక రాష్ట్రాల్లో కనిపించనున్నట్లు- ఐఎండీ పేర్కొంది. సముద్ర తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు, పిడుగుపాట్ల ప్రభావం ఉండే అవకాశముందని తెలిపింది. ఇక గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వడగాలులు కొనసాగుతాయని ఐఎండీ అంచనా వేసింది. ఏప్రిల్ 9, 10 తేదీల్లో అసోం, మేఘాలయలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఏప్రిల్ 10న అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఈ రోజు నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. అదే విధంగా, వాయవ్య భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఏప్రిల్ 10న వర్ష సూచనలు ఉన్నాయి. నైరుతి, ఆగ్నేయ దిశల్లో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా వాయవ్యం, ఉత్తర దిశల వైపుగా కదిలే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. వర్షాలు, ఈదురుగాలులు, పిడుగుపాట్ల సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన వేళల్లో మాత్రమే ప్రయాణాలు చేయాలని వాతావరణ శాఖ సూచించింది. అలాగే వ్యవసాయదారులు తమ పంటలను సంరక్షించేలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించింది.

# జల్‌పల్లిలో మరోసారి ఉద్రిక్తం

- మోహన్‌బాబు ఇంటి ఎదుట పోలీస్ బందోబస్తు
- ఉదయం మోహన్‌బాబు ఇంటికి వెళ్లిన మంచు మనోజ్
- మోహన్‌బాబు ఇంట్లోకి ఎవరిని అనుమతించని పోలీసులు



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు చెందిన జల్‌పల్లిలోని నివాసం ఎదుట మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తనను ఇంట్లోకి రానివ్వడం లేదంటూ మంచు మనోజ్ మోహన్ బాబు నివాసం ఎదుట కూర్చొని నిరసనకు దిగారు. దీంతో ఎలాంటి ఘటనలు జరగకుండా పహాడీ షరీఫ్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మోహన్‌బాబు ఇంటి వైపునకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మీడియాతో మాట్లాడారు. తన పాప పుట్టిన రోజు కోసం ఏప్రిల్ 1 న జైపూర్ వెళ్లగా.. అదే రోజు తన ఇంటిని ధ్వంసం చేరారని అన్నారు. ఈ గొడవలను కావాలనే ఫ్యామిలీ గొడవగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు . తన ఇంట్లో జరిగిన విధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు నిర్లక్ష్యంగా మాట్లాడారని అన్నారు. మూడు సార్లు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా పహాడీ షరీఫ్ పోలీసులు కనీసం ఒక్క చార్జ్‌షీట్ దాఖలు చేయలేదని ఆరోపించారు. ఊర్లో లేనిది చూసి ఓ ప్లాన్ ప్రకారం చేతకాని విష్ణు తన ఇంటిని ధ్వంసం చేశాడని వివరించారు.

### న్యాయం చేయాలి..

జల్‌పల్లిలోని ఇంటికి వెళ్లడానికి అన్ని అనుమతులున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని మంచు మనోజ్ అన్నారు. తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంను వేడుకుంటున్నానని అన్నారు. క్యాంపస్‌లో జరుగుతున్న అక్రమాలు, విష్ణు దొంగతనాల గురించి ప్రశ్నించినందుకే తనపై కోపం పెంచుకొని ఇలా చేస్తున్నారని అన్నారు.

# ఎల్బీనగర్ కోర్టులో మోహన్‌బాబుకు చుక్కెదురు

### గత తీర్పును కొట్టివేసిన కోర్టు

### కొత్త సాక్ష్యాలు, ఆధారాలు బయటకు రావడంతో నిర్ణయం



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ కోర్టులో ప్రముఖ నటుడు మోహన్ బాబుకు సంబంధించిన జలపల్లిలోని ఇంటి వివాదం కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో గతంలో మోహన్ బాబుకు అనుకూలంగా తీర్పు లభించినప్పటికీ, తాజాగా ఎల్బీ నగర్ కోర్టు ఆ తీర్పును కొట్టివేసింది. ఈ నిర్ణయంతో ఈ వివాదం మరోసారి వార్తల్లో నిలిచింది. జలపల్లిలోని ఒక ఇంటికి సంబంధించిన ఆస్తి తగాదా విషయంలో మోహన్ బాబు గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో కోర్టు మోహన్ బాబు వాదనలను అంగీకరించి, ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే, ఈ వ్యవహారంలో కొత్త సాక్ష్యాలు, ఆధారాలు బయటకు రావడంతో కేసు మళ్లీ తెరపైకి వచ్చింది.

### కోర్టు ముందుకు కీలక ఆధారాలు..

మోహన్ బాబు తరపున కేసు వాదిస్తున్న వారికి వ్యతిరేకంగా, న్యాయవాది మనోజ్ కొన్ని కీలక ఆధారాలను కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కోర్టును తప్పుదోవ పట్టించే విధంగా మోహన్ బాబు తరపు న్యాయవాదులు వ్యవహరించారని, దీనికి సంబంధించిన సాక్ష్యాలను సమర్పించారని మనోజ్ వాదించారు. ఈ ఆధారాలను పరిశీలించిన ఎల్బీ నగర్ కోర్టు, గతంలో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలనకు తీసుకుంది. ఈ కేసుపై నిన్న (ఏప్రిల్ 8, 2025) జరిగిన విచారణలో, ఎల్బీ నగర్ కోర్టు గతంలో మోహన్ బాబుకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. కోర్టుకు సమర్పించిన కొత్త ఆధారాలు, సాక్ష్యాలు ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది.

### మోహన్‌బాబుకు ఊహించని షాక్..

ఈ తీర్పుతో మోహన్ బాబుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది. ఈ కేసులో మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, తప్పిదానికి పాల్పడిన ఒక కోర్ట్ క్లర్క్‌పై ఎల్బీ నగర్ కోర్టు చర్యలు తీసుకుంది. కేసు వివరాలను సరిగ్గా నమోదు చేయకపోవడం లేదా తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడం వంటి అంశాలపై ఆ క్లర్క్‌కు మెమో జారీ చేసినట్లు సమాచారం. మోహన్ బాబు తరపు న్యాయవాదులు ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఉన్నత కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో, మనోజ్ తరపు వారు కేసును మరింత బలోపేతం చేసేందుకు అదనపు ఆధారాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# సాగునీరు విడుదల చేయండి

### నిర్మల్ మంచిర్యాల రహదారిపై రైతుల రాస్తారోకో



**నేటి ప్రస్థానం, నిర్మల్:** సదర్ మాట్ కాలువ ద్వారా చివరి ఆయకట్టు భూములకు సాగు నీరు అందకపోవడంతో నిర్మల్ జిల్లా కడెం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు నిర్మల్- మంచిర్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సాగునీరు సక్రమంగా విడుదల చేయకపోవడంతో చివరి దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించి పది రోజుల పాటు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే రైతుల నిరసనతో మంచిర్యాల ప్రధాన రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి.

## సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ సన్నద్ధం: డీజీపీ



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** వాణిజ్య రంగంలో మారుతున్న సవాళ్లకు తగిన విధంగా స్పందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ముందడుగు వేస్తోందని డీజీపీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా సైబర్ ఫ్రాడ్ నేరాలను అరికట్టేందుకు ఐజీ ర్యాంక్ అధికారిని ప్రత్యేకంగా నియమించామన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీమ్‌ను ఏర్పాటు చేయడం, వారి ప్రయాణ సౌకర్యార్థం షీ షటిల్ బస్సులు అందుబాటులోకి తేవడం వంటి చర్యలను వివరించారు. తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో మెరుగైన పోలీస్ నిఘా , ప్రజా భద్రతపై రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంకేతిక పోలీసింగ్, సైబర్ భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల భద్రతా సహకారంపై చర్చ జరిగింది. తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధి పోలీస్ భద్రతపై ఆధారపడి ఉంది. శాంతి భద్రతలను కాపాడడంలో మా బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్నాం, అని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ సమావేశం వాణిజ్య, పరిశ్రమల రంగం నుంచి విశేష స్పందన పొందింది. భద్రత , నిఘాపై ప్రభుత్వ నిర్ణయాలు పరిశ్రమల విశ్వాసాన్ని పెంచుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది.



## రోనాల్డ్ రోస్‌కు ఊరట

### తెలంగాణలో కొనసాగేలా ఉత్తర్వులు

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ రోనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. రోనాల్డ్ రోస్ తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రోనాల్డ్ రోస్.. ఏపీ ప్రభుత్వంలో ఆర్థికశాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇక తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యే ముందు రోనాల్డ్ రోస్.. విద్యుత్ శాఖ కార్యదర్శిగా కొనసాగారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం.. కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఐఏఎస్ అధికారులను గతేడాది అక్టోబర్‌లో డీవోపీటీ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులపై క్యాట్, హైకోర్టును ఆశ్రయించినా ఆయా ఐఏఎస్‌లకు ఊరట దక్కలేదు. దీంతో తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాల్సిన వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు. వెంటనే ఏపీలో రిపోర్ట్ చేశారు. మొత్తానికి ఏడు నెలల తర్వాత క్యాట్‌లో రోనాల్డ్ రోస్‌కు ఊరట దక్కింది. తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది.




# తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్


### మహబూబ్‌నగర్‌లో రజతోత్సవ సభ గోడ పత్రిక విడుదల

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన బీఆర్ఎస్ పార్టీ.. రాష్ట్ర అవతరణ అనంతరం తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే కేసీఆర్ తెలంగాణను సాధించారన్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్‌ను విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విశేషంగా అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై నిరంతర పోరు చేస్తున్నదని.. కాంగ్రెస్ చేసిన మోసాలు చూసిన రాష్ట్ర ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని వివరించారు. బీఆర్ఎస్ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు. షాద్ నగర్ మాజీ శాసనసభ్యుడు అంజయ్య యాదవ్ మాట్లాడుతూ సమైక్య పాలనలో అన్ని రంగాల్లో నష్టపోయిన తెలంగాణను సాధించేందుకు ఆనాడు కేసీఆర్ గాంధేయ పద్ధతిలో పోరాటం చేసి విజయం సాధించాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, మహబూబ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సాయిలు యాదవ్, గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నవకాంత్, శ్రీకాంత్ రెడ్డి, శరత్, జావేద్ బేగం పాల్గొన్నారు.

# విభజన సమస్యలపై కేంద్రం దృష్టి

## ఆయా శాఖలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు

**నేటి ప్రస్థానం, న్యూఢిల్లీ:** విభజన సమస్యలకు మెల్లగా పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఆయా సమస్యలపై కేంద్రం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అనేక అంశాలపై చర్చలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్రహోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు–ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు– విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది. ఈ సమీక్ష సమావేశంలో అమరావతి–హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని.. రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని.. దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గతంలో ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచించింది.



# తెలంగాణలోకి బీజేపీని రానివ్వం

- మతాల మధ్య పీఎం మోదీ చిచ్చు పెడుతున్నారు
- ఏటా 2 కోట్ల ఉద్యోగాలను ఇస్తామని చెప్పి మాట తప్పారు
- కాంగ్రెస్‌వి గాంధీ సిద్ధాంతాలైతే.. బీజేపీవి గాడ్సే ఆలోచనలు
- ఏఐసీసీ సమావేశాల్లో సీఎం రేవంత్



**నేటి ప్రస్థానం, స్టేట్‌బ్యూరో:** తెలంగాణలో బీజేపీని ఎట్టిపరిస్థితుల్లో అడుగుపెట్టనివ్వమని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గుజరాత్, అహ్మదాబాద్ వేదికగా కొనసాగుతున్న ఏఐసీసీ సమావేశాల్లో సీఎం మాట్లాడారు. మతాల మధ్య పీఎం మోదీ చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. దేశాన్ని విభజించాలని మోదీ చూస్తున్నారని అన్నారు. అలాగే గాడ్సే సిద్ధాంతాన్ని మోదీ ప్రోత్సహిస్తున్నారని, గాంధీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టినట్లు బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

ప్రధాని నరేంద్ర మోదీ నిరుద్యోగ యువత కోసం ఏటా 2 కోట్ల ఉద్యోగాలను ఇస్తామని చెప్పి మాట తప్పాడని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 'మహాత్మాగాంధీ, వల్లబాయి పటేల్ పుట్టిన గడ్డపై ఏఐసీసీ సమావేశాలు నిర్వహించుకుంటున్నాం. గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని మనం చూస్తుంటే.. గాడ్సే ఆలోచనను మోదీ ఎత్తుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సక్సెస్ ఫుల్ గా కులగణన చేశాం. రూ. 2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశాం. గాంధేయ వాదులు రాహుల్ గాంధీకి అండగా నిలవాలి. తెలంగాణలో బీజేపీకి స్థానమే లేదు' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 10 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 20 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా..? అని సీఎం నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను ఇంతవరకు అమలు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

## దేశాన్ని విభజించాలని మోదీ పన్నాగం..

ప్రధాని నరేంద్ర మోదీ మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. 'దేశాన్ని విభజించాలని మోదీ చూస్తున్నారు. భారతదేశం అంతటా కులగణన చేపట్టాలి. తెలంగాణలో కులగణన పూర్తి చేశాం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కి ఇచ్చిన హామీని నెరవేర్చాం. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసి చూపించాం. గాడ్సే సిద్ధాంతాన్ని మోదీ ప్రోత్సహిస్తున్నారు. గాంధీ విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు పనిచేస్తున్నారు. బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టినట్టే బీజేపీని కూడా ఓడించాలి. తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనివ్వం' అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

'తెలంగాణలో మేం బీజేపీకి అవకాశం ఇవ్వం. గుజరాత్ గడ్డపై నుంచి నేను చెబుతున్నా. మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో మాకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది. మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వకమైన బంధం ఉంది. మాకు స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇచ్చారు.. తెలంగాణను మాకు సోనియా గాంధీ అందించింది. వల్లభాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒక్కటే చెబుతున్నా.. సోనియా గాంధీ నాయకత్వంలో మేం బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం. బీజేపీని అడ్డుకుంటాం.. వారిని ఎవరూ క్షమించరు' అని సీఎం రేవంత్ రెడ్డి ఫైరయ్యారు.

గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేశారు.. .కానీ బ్రిటిష్‌వాళ్లు ఎప్పుడూ గాంధీజీ మీద లాఠీ ప్రయోగం చేయలేదు. స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారు. బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులు. బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలి. మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలి. తెలంగాణలో బీజేపీని అడ్డుకునేందుకు, ఓడించేందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకొని వెళుతున్నాం. రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకొని వెళ్లాలి' అని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

# మాజీ ఐపీఎస్ పాస్‌పోర్టు రద్దు

## రెడ్ కార్నర్ నోటీస్ ప్రక్రియ మొదలైనట్లు సిటీ పోలీసులకు సీబీఐ సమాచారం



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కీలక సూత్రధారి అయినటు వంటి మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావుకి కేంద్ర ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. ప్రభాకర్ రావు పాస్ పోర్ట్ రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రభాకర్ రావు పాస్ పోర్ట్ రద్దు అయినట్లు సిటీ పోలీస్‌కి కేంద్ర సర్కార్ నుంచి సమాచారం వచ్చినట్లు తెలుస్తుంది. కాగా, ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసు ప్రక్రియ మొదలైనట్లు సిటీ పోలీస్ కి సీబీఐ అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే, వైద్య చికిత్స కోసం అమెరికాకు వెళ్లి అక్కడే ప్రభాకర్ రావు ఉండి పోయారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పోలీసులు సుదీర్ఘంగా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో కీలక సూత్రధారిగా భావిస్తున్న శ్రవణ్‌రావును పోలీసులు ఇప్పటికే మూడు సార్లు విచారించారు. అలాగే ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఆయనను హైదరాబాద్‌కు రప్పించేందుకు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఆ ప్రయత్నాలేవి ఫలించలేదు. పైగా ఆరోగ్యం కుదుట పడిన తర్వాత వస్తా అంటూ సమాచారం ఇచ్చినట్లు ప్రచారం సాగింది. ఈ క్రమంలో ప్రభాకర్ రావు పాస్ట్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు పాస్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా.. హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లిన ప్రభాకర్ రావు.. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయినప్పటి నుంచి అక్కడే తలదాచుకున్నారు. గతంలో చాలా సార్లు నోటీసులు ఇప్పించినప్పటికీ ప్రభాకర్ రావు ఇండియాకు రాలేదు.. విచారణకు సహకరించలేదు. దీంతో ఆయనకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయడంతో పాస్ పోర్టు రద్దయింది.

# వక్ఫ్ ఆస్తులను చెరబట్టిందే కాంగ్రెస్

## మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ దేశం, ధర్మం, డెవలప్‌మెంట్ అంశాలతో పరిపాలన అందిస్తున్నారని మాజీ భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ దివంగత నేత ఆలే నరేంద్ర వర్థంతి సందర్భంగా నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే ఆయన మాటల్లోనే.. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే ఎంఎస్‌ఎంఈ రంగంలో ఎలాంటి పూచీకత్తు లేకుండా ముద్ర లోన్లు ప్రవేశపెట్టాం. దేశంలో మోదీ ప్రభుత్వంలో 52 కోట్ల మంది చిన్న పారిశ్రామికవేత్తలకు రూ. 32 లక్షల కోట్లు సెబీ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడంతో కోట్లాది మంది ఉపాధి పొందడంతో పాటు మరికొంత మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగారు. ఈ రుణాల్లో 55% మేర ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు లబ్ధి చేకూరింది. కాంగ్రెస్ పార్టీ 71 సంవత్సరాల పాలనలో ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూసింది. మోదీ మాత్రం శక్తీకరణ చేస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా భారతీయులే ప్రథమంగా భావించేలా పాలన సాగుతోంది. తెలంగాణలో 4 లక్షల మంది విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 40 వేల మందికి శిక్షణ, టూల్ కిట్, రుణ సబ్సిడీ లభించింది. అయితే రెండున్నర లక్షల దరఖాస్తులపై వెరిఫికేషన్ చేపట్టకుండా, ఈ పథకం అమలు అడ్డుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం సైంధవుడిలా ప్రవర్తిస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ స్కీమ్, విశ్వకర్మ యోజనను తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

## వక్ఫ్ చట్టంతో మైనార్టీల్లో విశ్వాసం..

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం వర్గాల్లో విశ్వాసాన్ని పెంపొందించామని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు పార్లమెంటులో విఘాతం కలిగించేందుకు యత్నించినా ముస్లిం మహిళలు మోదీకి మద్దతు పలికి నీరాజనం పలికారు. దేశంలో 9, 40,000 వేల ఎకరాల వక్ఫ్ భూమిలో 75% నుంచి 80% కబ్జా అయ్యాయి. తెలంగాణలో 77538 ఎకరాల వక్ఫ్ భూమిలో 55,423 (75% )కబ్జా అయ్యాయి. హైదరాబాదులో ప్రైవేట్ హాస్పిటల్స్, ఫంక్షన్ హాల్స్, మెడికల్ కాలేజీలు వక్ఫ్ బోర్డు యాజమాన్యాలు, మెంబర్లు, ముతావల్లీలు, బడా నేతలు, కాంగ్రెస్ నాయకుల చేతుల్లో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ప్రపంచంలో వక్ఫ్ ఆస్తులు అత్యధికంగా భారతదేశంలోనే ఉన్నాయి. కానీ ఏటా రావాల్సిన కనీస రూ. 12,000 కోట్ల ఆదాయానికి బదులుగా కేవలం రూ. 163 కోట్లు మాత్రమే వస్తున్నాయి. అంటే దాదాపు 11 వేల కోట్లు వక్ఫ్ ఆస్తులను సిండికేట్ గా దండుకున్నది బోర్డు మెంబర్లు, బడా నేతలే. 2005 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ సచార్ కమిటీ ముస్లింల ఆర్థిక, సామజిక, విద్య ఎదుగుదల విషయంలో అధ్యాయానికి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో